ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

3 జిల్లా వార్తలు

సోమవారం 14 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత
గరిష్ఠం 41.2
కనిష్ఠం 19.7



సాయిరెడ్డి చెరువులో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, లావణ్య

చెరువుల పునరుద్ధరణ శుభపరిణామం

బహుళజాతి సంస్థలు ముందుకు రావడం అభినందనీయం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చెరువుల పునరుద్ధరణకు అమెజాన్, సెట్రీస్ సంస్థలు ముందుకు రావడం శుభపరిణామమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని కొత్తూర్ తండా శివారులోని సాయిరెడ్డి చెరువు పూడికతీత పనులను ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. 32ఎకరాలు ఉన్న సాయిరెడ్డి చెరువును దిగ్గజ అమెజాన్ సంస్థ దత్తత తీసుకుని సెట్రీస్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బహుళజాతి సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను దత్తత తీసుకుని పూడికతీతతో పాటు, బండింగ్ నిర్మాణాలు, వాకింగ్ ట్రాక్, సుందరీకరణ పనులు చేపట్టడం శుభపరిణామమన్నారు. చెరువుల పునరుద్ధరణతో వర్షపు నీరు నిలిచి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నూతనంగా ఏర్పడిన కొత్తూర్ మున్సిపాలిటీలో గత ప్రభుత్వం ప్లాన్ లేకుండా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టి అస్తవ్యస్తంగా మార్చారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేసిన తప్పులను సరిచేసుకుంటూ వస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన రహదారి, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని బట్టర్‌ఫ్లై లైట్లతో సుందరంగా తీర్చి దిద్దడం జరిగిందన్నారు. మున్సిపాలిటీని అన్నిరంగాల్లో తీర్చి దిద్దేందుకు 50కోట్ల రూపాయలతో ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోమ్లనాయక్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె. సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, యాదయ్య, దేవేందర్‌ముదిరాజ్, జె. శ్రీను, గోవింద్‌నాయక్, మత్స్యకారులు మాసుల అంజయ్య, ఇప్పలగిరి సెట్రీస్ సీఈవో దేవ్‌కాంత్, అమరేందర్, సురేష్, షాహజాన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి 6





రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి నానా పాట్లు పడాల్సి వస్తోంది. మీ సేవా కేంద్రాల్లో అప్లై చేసుకునే క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తి దరఖాస్తుదారులు సతమతమవుతున్నారు. నాలుగైదు రోజులుగా సర్వర్ డౌన్ అని చూపిస్తుండటంతో యువత మీసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి పదే పదే వెబ్‌సైట్ ఓపెన్ చేయాల్సి వస్తుంది. వివరాలు అన్ని ఫిల్ చేసిన తర్వాత ఒక్కోసారి వెబ్‌పేజీ నిలిచిపోతుంది. ఇలా నాలుగైదు రోజులుగా జరుగుతుండటంతో యువతీయువకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నేటితో దరఖాస్తు ముగుస్తుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు. గడువు తేదీ పొడిగించే అవకాశం లేదని అధికారులు చెబుతుండటంతో అయోమయానికి గురవుతున్నారు.

సర్వర్ డౌన్!

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తుకు ఇబ్బందులు

- మీ సేవ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు
- నేటితో ముగియనున్న గడువు
- ఆందోళనలో నిరుద్యోగ యువత
- ఇప్పటికే అర లక్ష దాటిన అప్లికేషన్లు
- అత్యధికంగా బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆర్థిక రాయితీ ఇలా

యూనిట్ ఖర్చు (రూపాయలు)	ప్రభుత్వ సబ్సిడీ (శాతం)	బ్యాంకు రుణం (శాతం)
50,000 వరకు	100	0
50,001 నుంచి 1,00,000	90	10
1,00,001 నుంచి 2,00,000	80	20
2,00,001 నుంచి 4,00,000	70	30
వల్నెరబుల్ గ్రూప్స్‌కు లక్ష	90	(10 ఈఎంఎఫ్)
మైనర్ ఇరిగేషన్	100	0

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా ఆర్థిక సహకారం అందించాలనేది ముఖ్య ఉద్దేశం. యువత యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ. 50 వేల నుంచి 4 లక్షల వరకు రుణం ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ పథకానికి యువత నుంచి మంచి స్పందన లభిస్తుంది. దరఖాస్తు చేసుకోవడానికి చాలామంది ముందుకు వస్తున్నారు. అయితే దరఖాస్తు ప్రక్రియలో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వర్ లోపాలతో పాటు సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో ఇంటర్నెట్, మీ సేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారు. కొన్నిసార్లు అప్లికేషన్ చివరిదశకు వచ్చాక

మిగతా 6వ పేజీలో...

4 రోజులుగా మీసేవ చుట్టూ..



సర్వర్‌డౌన్ కారణంగా మీసేవ కేంద్రం చుట్టూ నాలుగు రోజులు తిరిగాను. ఐదో రోజు రాత్రి నా దరఖాస్తు ఓకే అయ్యింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్, ఆధార్, పాన్ కార్డుల వివరాలతో రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణ సహాయం వస్తదని ఆశగా ఉన్నాను. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అర్హులైన వారికి అవకాశం కల్పించాలి.

వి. శేఖర్, కార్పెంటర్, చేవెళ్ల

యువ వికాసం.. సదవకాశం

పద్మావతి, ఎస్సీ కార్పొరేషన్ డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ 6



గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హామీ మేరకు ఫార్మాసిటీని రద్దు చేశాం

- ఫ్యూచర్ సిటీతో యువతకు ఉపాధి కల్పిస్తాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీని రద్దు చేశామని, కొత్తగా భూములు తీసుకోబోమని, ఈ ప్రాంత అభివృద్ధికి, యువత ఉద్యోగాల కల్పనకు ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మల్కీజ్‌గూడ, నందివనపర్తి, ధర్మన్నగూడ గ్రామాల్లో రూ.75లక్షలతో చేపట్టిన పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నందివనపర్తిలో జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షుడు సంగం సత్తయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకులు వారి స్వలాభం కోసం ఫార్మాసిటీ ఏర్పాటుకు పూనుకోవడం బాధాకరమన్నారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రోరైల్ ఏర్పాటుకు ప్రభుత్వం అధికారులను ఆదేశించిందన్నారు. అమెజాన్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి స్కూల్‌లో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ నిర్మాణం చేయిస్తానని చెప్పారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే కె.రాములు, ఏఎంసీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, నాయకులు మస్కు నర్సింహ, అక్బర్, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో క్రీడా సంబురం

- ప్రీమియర్ క్రికెట్ లీగ్‌లతో యువత ఉర్రూతలు
- జట్లుగా ఏర్పడి గ్రామాల్లో పోటీల నిర్వహణ
- వెన్నుతట్టి ప్రోత్సహిస్తే.. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి యువత

6

అభివృద్ధిలో భేష్!



షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లోని వైకుంఠధామం

- ఉద్దండపూర్, సర్దార్‌నగర్, కొర్రెముల, సంగెంకలాన్‌లో ప్రగతి పరుగులు
- పల్లె ప్రగతి కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న పల్లెలు
- ప్రభుత్వ ప్రోత్సాహకాలతో సకల సదుపాయాలు
- ఉత్తమ గ్రేడింగ్‌లు ఇచ్చిన కేంద్ర పంచాయతీరాజ్ శాఖ

పల్లెకు పట్టం 2

కేంద్ర ప్రభుత్వం 2023-24 నాటికి పంచాయతీల పురోగతి ఆధారంగా ఆదర్శ గ్రామాలను ప్రకటించింది. "గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, పేదరిక నిర్మూలన, జీవనోపాధి పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు సౌకర్యాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక వసతుల్లో స్వాలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూల విధానాలు.." అనే తొమ్మిది అంశాల ఆధారంగా పనితీరు స్కోర్ ఇచ్చారు. పల్లె ప్రగతిలో వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఉద్దండాపూర్, సంగెం కలాన్, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల టాప్‌లో నిలిచి కేంద్ర పంచాయతీ రాజ్ సంస్థతో భేష్ అనిపించుకున్నాయి.

5

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి

- బీజేపీ రాష్ట్రనేత తూళ్ల వీరేందర్‌గౌడ్



మాట్లాడుతున్న తూళ్ల వీరేందర్‌గౌడ్

మంచాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర నేత తూళ్ల దేవేందర్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంచాలలో ఆదివారం జరిగిన బీజేపీ క్రియాశీల సభ్యుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలను నమ్మించి మోసం చేశారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రాక్షస పాలన చూసిన తెలంగాణ ప్రజలు ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలే ఇందుకు ఉదాహరణ అని గుర్తుచేశారు. హైదరాబాద్ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ గుట్టు తెలిసిపోతుందని చెప్పారు. త్వరలో సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపాలిటీల ఎన్నికలు జరగనున్నాయని ఇందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు నూకం రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ దన్నెబోషయ్య, పాండాల జంగయ్య, కె.జనార్దన్‌రెడ్డి, కొండల్, మెండు వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, జి.నర్సింహారెడ్డి, జయశ్రీ, యారా రాజు, వెంకట్‌రెడ్డి, మహేందర్ గౌడ్, భిక్షపతి, రమేష్, బండిరాజు, ఐలయ్యయాదవ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా రథోత్సవం

యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో ఆదివారం శ్రీసీతారామ చంద్ర స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ... వందలాది మంది భక్తులు రథాన్ని లాగారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా యాచారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యాచారం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి)

కాలమేదైనా కలిసొచ్చే పంట

- అన్ని కాలాల్లో సాగుకు అనుకూలం
- తక్కువ ఖర్చు.. ఎక్కువ లాభం
- నియోజకవర్గంలో 432 ఎకరాల్లో సాగు

ఆకుకూరల సాగుపై రైతుల ఆసక్తి

ఆకు కూరల్లో ముఖ్యంగా పాలకూర, కొత్తిమీర, మెంతం కూర, తోట కూర, పుంటికూర, పాయిల్‌కూర, తదితర ఆకు కూరల్లో అధిక విటమిన్లు ఉంటాయని అందరికి తెలిసిందే. అయితే ఆకు కూరలు అన్ని కాలాల్లో స్వల్ప వ్యవధిలో పంట చేతికి వస్తుంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు స్పష్టం చేస్తున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో రైతులు కూరగాయలతోపాటు ఆకుకూరల పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ఆకు కూరల పంట కేవలం మూడు నాలుగు వారాల్లో చేతికి వస్తుండటంతో రైతులు మరింత ఆసక్తి చూపిస్తున్నారు.



కేసారంలో కొత్తిమీర సాగు

చేవెళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లోని రైతులు ఇతర కూరగాయల పంటలతో పాటు ఆకుకూరలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ నగరానికి చేరువగా, మార్కెటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో చాలా మంది రైతులు బోరు, బావుల కింద డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకొని ప్రధాన పంటగా పాలకూర, చుక్క కూర, మెంతం, తోటకూర, పుంటి కూర, పుదీన, కొత్తిమీర తదితర ఆకుకూరల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరం ఆకు కూరలు సాగు చేస్తే రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి అవుతుంది. పంట చేతికి వచ్చాక మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి రైతుకు పెట్టుబడిపోను రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు

మిగతా 6వ పేజీలో...

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ఆకుకూరలు సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. రాయితీపై విత్తనాలను అందించాలి. ఇతర కూరగాయల పంటలతో పోల్చితే ఆకుకూరలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తక్కువ పెట్టుబడితో పాటు 30 నుంచి 40 రోజుల వ్యవధిలో పంట చేతికి వస్తుంది.

- ఎల్. రాములుగౌడ్, రైతు, గొల్లపల్లి



మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి, పక్కన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన ప్రజలు

- ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు ప్రజలు విసిగి పోయారని, అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి విధివిధానాలు లేకుండా సీఎం రేవంత్ నిర్ణయాలు తీసుకోవడంతో అసలైన లబ్ధిదారులకు తీరని అన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సార్లరావులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన 14వేల ఎకరాల భూమిలో ఫ్యూచర్‌సిటీ, ఫోర్త్ సిటీని ఏర్పాటు చేయకుండా.. మరో 3వేల ఎకరాలను సేకరించడం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రోడ్లను వినియోగించుకోకుండా రూ.2వేల కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును నిర్మించడం అవసరమా అని నిలదీశారు. అలాగే ఫ్యూచర్‌సిటీ పేరుతో ఈ ప్రాంత ప్రజలను గందరగోళంలో పడేశారన్నారు. మంచిరెడ్డి, జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ప్రయోజనాల కోసం కుర్మిద, బ్రాహ్మణపల్లి గ్రామాల మీదుగా మేడిగడ్డ వరకు ట్రిబుల్ఆర్ రోడ్డును పెంచారని ఆరోపించారు. ఈనెల 27న నిర్వహించే వరంగల్ సభకు భారీగా తరలి రావాలని కోరారు. ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, జె.దశరథనాయక్, రజితప్రవీణ్‌నాయక్, సురేష్, ఇందిరాదేవేందర్, ఏ.మేఘనాథ్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చిందే బీజేపీ



వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలకులు అంబేడ్కర్‌ను అవమానిస్తే బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డును ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. ఈ నెల 13 నుంచి 25 వరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాతగంజ్‌లోని హనుమాన్ ఆలయం నుంచి రైల్వే స్టేషన్ అంబేడ్కర్ విగ్రహం వరకు వెళ్లి విగ్రహాన్ని నీటితో శుభ్రం చేశారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, దిశ కమిటీ సభ్యులు వడ్ల నందు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాతను స్మరిస్తూ దేశవ్యాప్తంగా బీజేపీ ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సదానందారెడ్డి, మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు శిరీష, నవీన్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా ఏకం కావాలి



అన్మాస్‌పల్లిలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని కాలరాసి, మహనీయుల చరిత్ర, జ్ఞాపకాలను చెరిపేసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్మాస్‌పల్లిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడప గడపకు తిరిగి రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకత, మహాత్మాగాంధీ, అంబేడ్కర్ ఆశయాలను, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాజ్యాంగ పరిరక్షణపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేక విపక్షాలు విష ప్రచారం సాగిస్తున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, డీసీసీ కార్యదర్శి బీక్యానాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్, తాలుకా అధ్యక్షుడు శంకర్, చేగూరి వెంకటేశ్, షాబుద్దీన్, హీరాసింగ్, శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, మోత్య, జహంగీర్ అలీ, సత్యం, రాంచందర్, జవహర్‌లాల్, తులసీరామ్, నరేందర్, ఇమ్రాన్‌బాబ, రవి, రాజేశ్, అశోక్, రామకృష్ణ, జగన్, మల్లేశ్ గౌడ్, ప్రవీణ్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు ముందుకురాని కాంగ్రెస్



పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైపాల్‌యాదవ్, నాయకులు

కడ్తాల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకత ఉందనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు ప్రజలు ఉప్పెనలా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం కడ్తాలలోని తన నివాసంలో జైపాల్ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ సభపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. సభకు తరలివెళ్లడంపై చర్చించి రజతోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జైపాల్ మాట్లాడుతూ... రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఎండగట్టి ప్రజలపక్షాన పోరాడాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. వరంగల్ సభకు ప్రతి గ్రామం నుంచి దండుకట్టాలన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, విజితారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు అర్జున్‌రావు, పత్యానాయక్, జైపాల్‌రెడ్డి, పరమేశ్, శంకర్, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ యాదవ్, నాయకులు వీరయ్య, లాయక్‌అలీ, కె.రామకృష్ణ, రమేశ్, నర్సింహగౌడ్, హరిచంద్, లాలయ్యగౌడ్, శ్రీను, సైదులుగౌడ్, సయ్యద్ ఖలీల్, లచ్చిరామ్‌నాయక్, జంగయ్య, అంజి, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ధ్యాన మందిరంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):పరిగి మునిసిపల్ పరిధిలోని శ్రీసాయి ధ్యానమందిర వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి వేర్వురుగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతినిధులతోపాటు, భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, మాజీ జెడ్పీటీసీ కె.నాగిరెడ్డి, అశోక్, సురేందర్, ప్రవీణ్‌రెడ్డి, కె.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

పరిగి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ 12వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్సీ వద్ద జెండాను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎ.రాములు, కె.జమున, మోయిజ్ ఖాన్, కె.వెంకటయ్య, మేగ్యా, బిచ్చయ్య, జైపాల్, శంకర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ నిరంతర పోరు



జెండావిష్కరణలో నాయకులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య అన్నారు. యూటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలో జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి జూన్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట, కళాజాతా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాములయ్య, జగన్నాథశర్మ, కిషన్‌చౌహాన్, సుగంధ, నాగేంద్రం, కిరణ్‌కుమార్, అజ్మత్ ఖాన్, అంజయ్య, సంతోషిణి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీనిధి' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



వర్సిటీ గేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఘట్‌కేసర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా స్కాలర్‌షిప్ టెస్ట్, నూసెట్-2025 నిర్వహిస్తున్న శ్రీనిధి యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని వర్సిటీ గుర్తింపును రద్దుచేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం పోచారం పరిధి యంనంపేట్‌లో గల శ్రీనిధి యూనివర్సిటీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీనిధి యూనివర్సిటీ విద్యార్థులను ఎర వేసేందుకు స్కాలర్‌షిప్ టెస్టులు నిర్వహించడం అక్రమం అన్నారు. ఇది విద్యారుథలను, తల్లిదండ్రులను మోసం చేయడమేనని, ఈ పరీక్ష కోసం ప్రతీ విద్యార్థి నుంచి రూ.వెయ్యి వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, సత్యప్రసాద్, శేఖర్, వెంకటేశ్వర్‌రావు, కల్యాన్, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించాలి



హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంజులరమేష్

వికారాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చేనేత, హస్తకళాలను ప్రోత్సహించాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజులరమేష్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని ఫతే గార్డెన్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనకు ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకుడు రమేష్, ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను
విజయవంతం చేయాలి

కొత్తూర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు కార్మికులు తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని, ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను శ్రమదోపిడీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి, నాయకులు జనార్ధన్, నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భేష్!

పల్లెకు పట్టం 2

పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు సదుపాయాల కల్పన, ప్రభుత్వ నిధుల వినియోగం, పారిశుధ్యం, స్వచ్ఛత, పచ్చదనం తదితర కార్యక్రమాలపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ దేశ వ్యాప్తంగా గ్రామాలకు గ్రేడింగ్ ఇచ్చింది. ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఉద్దండపూర్, సర్దార్‌నగర్, కొర్రెముల, సంగెంకలాన్ గ్రామాలు ఆదర్శంగా నిలిచాయి.

అభివృద్ధిలో ఉద్దండపూర్.. పల్లె ప్రగతి కార్యక్రమాలతో ముందంజ

తాండూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని ఉద్దండపూర్ అభివృద్ధిలో దూసుకుపోతూ అందరితో భేష్ అన్పించుకుంటోంది. రూర్బన్, ఎస్డీఎఫ్, ఉపాధి నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, నీటి ట్యాంకులు, విద్యుత్ సౌకర్యం వంటి సదుపాయాలు కల్పించారు. పంచాయతీ భవనం, ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నాయి. ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు వేసి శుభ్రంగా ఉంచుకుంటున్నారు. గ్రామంలో తడి, పొడి సేకరణ చేస్తున్నారు. ప్రతింటికి నల్లా కనెక్షన్ ఉంది. 15రోజులకోసారి నీటిట్యాంక్‌ను బ్లీచింగ్ పౌడర్‌తో కడుగుతారు. 90శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. ఈ గ్రామం 2020 నుంచి 2025 వరకు 70.34శాతం సీఐడీ స్కోరు సాధించింది. గ్రామస్తులకు కావాల్సిన సదుపాయాల కల్పనలో గ్రామం ఆదర్శంగా నిలిచింది. ప్రతీ ఏడాది గ్రామస్తులు పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నారు. ఇటీవల తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో రూ.16లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు వేశారు.



ఉద్దండపూర్‌లోని వీధుల్లో వేసిన సీసీ రోడ్లు

గ్రామాన్ని అభివృద్ధితో తీర్చిదిద్దాం

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు కర్ణాటక ప్రాంతమైన కిష్టాపూర్, మిర్యాణి ప్రాంతాలకు మా గ్రామ దగ్గరగా ఉంది. ఉద్దండపూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నాం. సీసీ రోడ్లు, మురుగునీటి



కాల్వలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాం. శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, తడి/పొడి చెత్త సేకరణ వంటి వాటిని చేపడుతున్నాం. ప్రతీ వీధిలో సీసీ రోడ్లు వేసుకున్నాం. ప్రభుత్వ నిధులతోనే గ్రామాభివృద్ధి చేసుకున్నాం. ప్రజల సహకారం ఉంది. మా గ్రామానికి ప్రభుత్వాలు మరిన్ని నిధులు ఇవ్వాలి.

కౌసల్య, మాజీ సర్పంచ్, ఉద్దండపూర్

ప్రణాళికాబద్ధ అభివృద్ధి

ప్రణాళిక ప్రకారం పనులు చేసుకుంటున్న గ్రామాల అభివృద్ధిలో



ముందు వరుసలో ఉన్నాయి. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ చేయూతతో అభివృద్ధి సాధిస్తున్నాయి. ఉద్దండాపూర్‌లో వారంలో రెండుసార్లు పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నాం. ఏమైనా సమస్యలుంటే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పరిష్కరిస్తున్నాం. ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో ఎక్కువ దృష్టి పెడుతున్నాం.

విశ్వప్రసాద్, ఎంపీడీవో, తాండూరు

సకల సదుపాయాల 'సంగెంకలాన్'



సంగెంకలాన్ గ్రామం

తాండూరు రూరల్(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు గ్రామం సంగెంకలాన్ సుస్థిరాభివృద్ధి సాధించింది. గ్రామంలో చేపట్టిన పనులతో 77.8శాతం పీడీఐ స్కోరు సాధించింది. రూర్బన్ నిధులు రూ.10లక్షలు, ఉపాధి నిధులు రూ.25లక్షలతో సీసీ రోడ్లు, మరో రూ.10లక్షల ఎస్డీఎఫ్‌తో డ్రెయిన్లు, రూ.15లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, పాఠశాల నిర్మించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో సీసీ రోడ్లు వేసుకున్నారు. మీ-సేవ భవనం, పాఠశాల అదనపు గదులు, నిరంతరం కొనసాగే అంగన్‌వాడీ కేంద్రానికి భవనాలు నిర్మించారు. గ్రామంలో నీటి సమస్య లేదు. శ్మశాన వాటిక, క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. పల్లె దవాఖానాకు భవనం నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ ప్రణాళికబద్ధ అభివృద్ధి సాధించారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

ప్రజల సహకారంతోనే సంగెంకలాన్ అభివృద్ధి జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రజలకు సదుపాయాలు కల్పించాం. ఏ కాలనీలో చూసినా సీసీ రోడ్లు ఉన్నాయి. నీరు, రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాల, మీ-సేవ కేంద్రం వంటివి ప్రజలకు అందుబాటులో ఉంచాం. ప్రస్తుతం ఆరోగ్య కేంద్ర నిర్మాణం జరుగుతోంది. మాజీ మంత్రి మహేందర్ రెడ్డి, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి, మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేల సహకారంతో భారీగా నిధులు సమకూరాయి. నిధులు దుర్వినియోగం కాకుండా అన్ని పనులు చేసుకున్నాం.



- మేఘనాథ్‌గౌడ్, మాజీ సర్పంచ్, సంగెంకలాన్

సుపరిపాలన, వసతుల కల్పనకు పట్టం



ఆరోగ్య ఉప కేంద్రం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామస్తులకు సుపరిపాలన అందించి, వసతులు కల్పించడంలో కొర్రెముల ఆదర్శంగా నిలిచింది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసిన ఉత్తమ పంచాయతీల్లో కొర్రెముల 75.31స్కోర్‌తో జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. 10వేలకుపైగా జనాభా ఉన్న కొర్రెములలో పదెకరాల గ్రామ కంఠం, 1,750 ఎకరాల రెవెన్యూ భూమి ఉది. గ్రామంలో కొత్తగా 17కాలనీలు ఏర్పడ్డాయి. గ్రామంలో అంతటా సీసీ రోడ్లున్నాయి. నిత్యం పరిసరాల పరిశుభ్రత పాటిస్తారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి నీడనిస్తున్నాయి. నీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్లు వేశారు. ట్రాక్టర్‌లో చెత్త సేకరించి కంపోస్టు ఎరువుల తయారీ చేస్తున్నారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని, దాతల సహకారంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. యువత, విద్యార్థుల కోసం పుస్తకాలు, మ్యాగజైన్లు, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు. ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. చౌరస్తా, బస్టాండ్‌ల్లో టాయిలెట్లు కట్టారు. సుపరిపాలన(గుడ్ గవర్నెన్స్)లో భాగంగా గ్రామస్తులకు ఇంటి నిర్మాణ అనుమతులు, మ్యుటేషన్, ఇతర సర్టిఫికెట్లు, పౌరసేవ కేంద్రం(సీఎస్‌ఈ)లో ఆన్‌లైన్ సేవలందిస్తున్నారు. 1,887 ఇళ్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వంద ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. కొర్రెములలో 109 డ్వాక్రా సంఘాలున్నాయి. 483 మందికి సాంఘిక సంక్షేమ పింఛన్లు అందుతున్నాయి. జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లను నిత్యం శుభ్రం చేస్తారు. తమ గ్రామం ఆదర్శంగా గ్రామంగా నిలవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి



ప్రజల సహకారంతోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాల చేయూత, ప్రజల సహకారం అవసరం. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర, గ్రంథాలయం, పశువైద్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నాం. ప్రభుత్వాల పథకాలతో ప్రజలకు లబ్ధిచేకుర్చాం. గ్రామంలో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం.

- వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్, కొర్రెముల

ప్రజాభిప్రాయం మేరకు పనులు



గ్రామస్తుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రణాళికతో పని చేశాం. తడి/పొడి చెత్తను డంప్ యార్డుకు తరలించి కంపోస్టు తయారు చేశాం. గ్రామస్తులకు గడువులోపు గృహ నిర్మాణ అనుమతులు, ఇతర సర్టిఫికెట్లు జారీచేశాం. నిత్యం ఆన్‌లైన్ సేవలు అందించాం. పాత గ్రామం, కొత్త కాలనీల్లో 1,887 ఇళ్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చి పన్ను వసూలు చేశాం. అందుబాటులో ఉన్న వనరులను గ్రామానికి వెచ్చించాం. కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామంగా ప్రకటించడం సంతోషంగా ఉంది.

- ఆర్.కవితాయాదవ్, పంచాయతీ మాజీ సెక్రటరీ, కొర్రెముల



సర్దార్‌నగర్‌లో అల్లికలను పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సునీల్‌కుమార్, సందీప్‌కుమార్(ఫైల్)

ప్రగతిలో సర్దార్‌నగర్

షాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామ పంచాయతీలు 2023-24 నాటికి సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసిన జాబితాలో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్ టాప్‌లో నిలిచింది.

సర్దార్‌నగర్ 78.39 స్కోర్‌తో ఆదర్శంగా నిలిచింది. ప్రజాభాగస్వామ్యం, ప్రభుత్వ సహకారం, అందరి కృషితో సర్దార్‌నగర్ అభివృద్ధి చెందింది. పురోగతి సూచికలో 78.39 పీడీఐ స్కోర్ సాధించింది. పల్లె ప్రగతి కింద వివిధ పనులు పూర్తిచేశారు. వైకుంఠధామం, కంపోస్టు యార్డ్, ప్రకృతివనం, హరితహారం, నర్సరీ, క్రీడాప్రాంగణం కట్టారు. రోడ్లకు ఇరువైపులా పెంచిన చెట్లు ఆహ్లాదకర వాతావరణాన్నిస్తున్నాయి. పల్లె పకృతి వనంలో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు.

గ్రామంలో కేంద్ర, రాష్ట్ర బృందాల పర్యటన

ఆదర్శ గ్రామం సర్దార్‌నగర్‌ను కేంద్ర పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి సునీల్‌కుమార్, రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సందర్శించి చేపట్టిన పనులను పరిశీలించారు. అలాగే ఎన్ఐఆర్‌డీ బృందం, మధ్యప్రదేశ్, బీహార్, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల అధికారులు, శిక్షణ పంచాయతీ కార్యదర్శులు, అప్పటి రంగారెడ్డి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు పలుమార్లు పర్యటించారు. ఆహ్లాదకరంగా ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని చూసి సంతోషించారు. తమ ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని వివిధ రాష్ట్రాల బృందాల సభ్యులు అన్నారు.



కొత్తగా నిర్మించిన పంచాయతీ భవనం

'పల్లె ప్రగతి'తో మారిన రూపురేఖలు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పల్లె ప్రగతి కార్యక్రమంలో నిర్దేశించిన అన్ని పనులనూ మేం సమర్థంగా చేసుకున్నాం. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. దీంతో మా గ్రామ రూపురేఖలు మారాయి. చేపట్టిన అన్ని పనులు పూర్తయ్యాయి. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేశాను. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపి మోడల్ విలేజ్‌గా ఎంపికకు పాటుపడ్డాం.

- మునగపాటి స్వరూప, మాజీ సర్పంచ్, సర్దార్‌నగర్

తిమ్మాయిపల్లిలో ఘనంగా ఉర్సు

దోమ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిమ్మాయిపల్లిలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలో ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు యాదయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, బాబర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సుల్తాన్‌పూర్‌లో ఉర్సు

పరిగి: పరిగి పరిధి సుల్తాపూర్ శివారులోని హజ్రత్ సయ్యద్ అఫ్రపుద్దీన్ అలియా ఉర్సు ఉత్సవాలు నేటి నుంచి(సోమవారం) నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉత్సవాల నిర్వహణ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ నెల 20 వరకు నిత్య కార్యక్రమాలు జరుగుతాయని ముతావలి ఉస్మాన్ ఆదివారం తెలిపారు. దౌలత్ హుస్సేన్‌సాహెబ్ పేరిట కార్యక్రమాలుంటాయని అజర్ తెలిపారు.



ఇండోర్ క్రికెట్ మైదానాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలి

కొడంగల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించేందుకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రశాంత్, పీసీసీ ప్రతినిధి యూసుఫ్ అన్నారు. ఆదివారం కొడంగల్ శివారులోని యాద్గిర్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఇండోర్ క్రికెట్ మైదానాన్ని ప్రారంభించారు. నాయకులు క్రీడాకారులతో క్రికెట్ ఆడారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో యువకులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర ఆటలాడేందుకు అవకాశం లేకపోయేదని, కొత్తగా ఏర్పాటు చేసిన మైదానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్రీడా పోటీల్లో శిక్షణ ఇస్తామని గ్రౌండ్ నిర్వాహకుడు ఇంతియాజ్ తెలిపారు.



సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

బహుజనులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యమివ్వాలి

యాచారం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో సమానత్వం సాధించేందుకు విద్య, ఉద్యోగ, రాజకీయ తదితర రంగాల్లో బహుజనులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే బీఆర్.అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుతాయని ఆలిండియా సమతా సైనిక్‌దల్ జాతీయ కన్వీనర్ మార్షల్ దిగంబర్ కాంబ్లే అన్నారు. ఆదివారం రాత్రి నందివనపర్తిలో జై భీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జ్ఞానసభ యూత్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అట్టడుగు వర్గాలు పైకి రావాలంటే విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో వారికి తగిన ప్రాతినిత్యం ఇవ్వాలన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లుపొడిచేలా ప్రస్తుత రాజకీయాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులకు పేదరిక నిర్మూలనపై దృఢ సంకల్పం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మరాఠి వివేక్, గుండాలు, గోపాల్, ఆర్.వెంకటేశ్వర్లు, బాషా పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఆమనగల్లులోని ఓ గార్డెన్‌లో ఆదివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జై సంవిధాన్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ పాలనా వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటిని వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బీక్యనాయక్, సత్యం, కృష్ణ, ఫరీద్, పి.శ్రీకాంత్, అలీం, సురేశ్, షాబుద్దీన్, శేఖర్‌గౌడ్, నర్సింహ, నాజర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్




ఆర్మీలో ఉద్యోగం సాధించిన విష్ణు, శివలను సన్మానిస్తున్న కురుమ సంఘం పెద్దలు

దేశ సేవతో పేరు తేవాలి

వికారాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన యువకులు ఈ ప్రాంతానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఎంపీడీవోల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ధారూరు మండలం తరిగోపులకు చెందిన మోగిలేష్ కుమారులు విష్ణు, శివ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో ఆదివారం వికారాబాద్‌లోని గాంధీ కాలనీలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్య అతిథి ఎంపీడీవో మాట్లాడుతూ.. మన ప్రాంతం నుంచి ఇద్దరు యువకుడు ఆర్మీకి ఎంపికకావడం సంతోషకరం అన్నారు. వీరికి దేశానికి సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. కుర్మ బిడ్డలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, జర్నలిస్ట్ గోపాల్, 'భృంగి' డైరెక్టర్ శివప్రసాద్, ఉపాధ్యాయుడు శ్రీశైలం, బుచ్చయ్య, నర్సిములు, శ్రీను, నర్సిములు, రాములు, మాధవ్, సంధ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తెస్తాం

మంచాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు వంగాల కృష్ణ పిలుపునిచ్చారు. ఆరుట్ల టీడీపీ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూకం బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆజాద్, ఉపాధ్యక్షుడు చీమర్ల భాస్కర్, కోశాధికారి లొంగారి యాదయ్య, ప్రచార కార్యదర్శులు జంగాచారి, సుదర్శన్, ఉపకార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కృష్ణ మాట్లాడుతూ.. బడుగుల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మహేందర్, కె.వెంకట్‌రెడ్డి, ఆనంద్, శ్రీరాం హన్మంతు, రాములు, భద్రయ్య, నర్సింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్లలో టీడీపీ నూతన కమిటీతో కృష్ణ తదితరులు



పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న శరణు బసప్ప

ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కరన్‌కోట్‌లో మూడు రోజులు కొనసాగిన హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆంజనేయస్వామికి అభిషేకం, పల్లకిసేవ, రథోత్సవం నిర్వహించారు. మాజీ ఎంపీపీ శరణుబసప్ప స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శనివారం రాత్రి 11గంటలకు ఆంజనేయస్వామి రథోత్సవం సాగింది. ఎస్సై విఠల్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకులు టి.శ్రీనివాస్‌గౌడ్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వీసీ కుమార్

సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అంకుశాపూర్‌లోని మహేంద్రహిల్స్ సోషల్ వెల్ఫేర్ గురుకుల ఉమెన్స్ డిగ్రీ కాలేజీ విద్యార్థినులు ప్రతిభ చూపారు. మంత్రి వారితో మాట్లాడుతూ.. విద్యార్థులు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని సూచించాడు. కళలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుందని చెప్పారు. వెస్ట్రన్ డాన్స్‌లో సింధుజా, గ్రూప్‌పెయింటింగ్‌లో అభినయ, ఏకపాత్రాభినయంలో శ్రీలక్ష్మి ప్రతిభ చాటి ప్రథమ బహుమతి పొందారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కుమార్, ప్రిన్సిపాల్ స్నేహలత, తెలుగు విభాగాధిపతి శ్రీభాష్యం, లక్ష్మిఅసిరెడ్డి విద్యార్థులను అభినందించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్

ప్రజలందరిపై పెద్దమ్మతల్లి దీవెనలుండాలి

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సార్లరావులపల్లిలో నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయ వేడుకల్లో ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, జి.జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. అందరికీ అమ్మవారి దీవెనలుండాలని ఈ సందర్భంగా సబితారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆలయ ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జె.రజితప్రవీణ్‌నాయక్, నాయకులు రజినిసాయిచంద్, రామచంద్రనాయక్, సురేందర్‌రెడ్డి, డి.చంద్రశేఖర్, దశరథ్, జయేందర్, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, ప్రకాశ్‌రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లేమూరులో వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం

లేమూరులోని మాణ్యంబావి వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని జరుపుకున్నారు. ఆలయ చైర్మన్ జి.కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కొండల్‌రెడ్డి, హన్మంతరెడ్డి, ఆలయ వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జి.మల్లేశ్, బాలకృష్ణ, ఐలయ్య, జైపాల్, రాఘవేందర్ పాల్గొన్నారు.

'యువ వికాసం'.. సదవకాశం

● నేటితో దరఖాస్తుకు గడువు పూర్తి



- పద్మావతి, ఎస్సీ కార్పొరేషన్ డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఫటా ఫట్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం యువతకు మంచి అవకాశమని, లబ్ధిదారుల నుంచి ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి తెలిపారు. జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారని, ఇంకా దరఖాస్తులు పెరిగే అవకాశాలున్నాయన్నారు. ఈమేరకు ఈడీ పద్మావతి 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న : రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు?

జవాబు : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 13,816 మంది యువతీ యువకులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో అగ్రోబేస్డ్ యూనిట్స్, పశుపోషణకు, ఉద్యానవనం సెక్టారుకు, ఇండస్ట్రియల్ సర్వీస్ బిజినెస్‌కు, మైనర్ ఇరిగేషన్ కోసం, పెట్టి యూనిట్స్‌కు, ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌కు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని యూనిట్లు ఇవ్వాలని నిర్ధేశించారు?

జవాబు : 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 3,34,337 మంది ఎస్సీ జనాభా ఉంది. పలు రంగాల్లో వివిధ యూనిట్లను నెలకొల్పేందుకు యువతకు ఎస్సీ కార్పొరేషన్ ఆర్థిక సాయం అందించనుంది. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలు కలిపి ప్రభుత్వం 300కు పైగా స్కీమ్‌లను అందుబాటులో ఉంచింది. వీటి కోసం 21 మండలాలు, 18 మున్సిపాలిటీలు, ఆరు జీహెచ్ఎంసీల నుంచి మొత్తం 13,816 మంది యువత దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం 8,951 యూనిట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. అగ్రోబేస్డ్‌కు సంబంధించి 594, ఇండస్ట్రీ సెక్టార్‌కు 6,623, మైనర్ ఇరిగేషన్ 248, పెట్టీ యూనిట్స్ 1,486 ఉన్నాయి.

ప్రశ్న : లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుంది?

జవాబు : దరఖాస్తు గడువు ఈనెల 14 వరకు ఉంటుంది. దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ముందుగా మండల స్థాయి పరిశీలన కమిటీ, బ్యాంకు అధికారులు పరిశీలించి జిల్లా స్థాయికి పంపిస్తారు. ఆ తర్వాత జిల్లాస్థాయిలో అధికారులు పరిశీలించి యూనిట్‌ను మంజూరు చేస్తారు.

ప్రశ్న : ప్రభుత్వ సబ్సిడీ ఎలా ఉంది?

జవాబు : ప్రభుత్వం రూ.4లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తుంది. యూనిట్‌ను బట్టి 60 నుంచి 90శాతం వరకు సబ్సిడీ ఉంటుంది. మిగతా రుణం బ్యాంకులు అందిస్తాయి. మూడు కేటగిరీల్లో ఆర్థికసాయం ఉంటుంది. రూ.50 వేల వరకు ఖరీదు చేసే యూనిట్లకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ ఇస్తుంది. రూ.50 వేల నుంచి లక్ష వరకు ఖరీదు చేసే యూనిట్‌కు 90 శాతం, మిగిలిన 10 శాతం బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూస్తారు. రూ.లక్ష నుంచి రూ.2లక్షల మధ్య ధర కలిగిన యూనిట్‌కు 80 శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు రుణం అందిస్తుంది. రెండు నుంచి 4 లక్షల వరకు ఉన్న యూనిట్లకు ప్రభుత్వ ఖర్చుల్లో 70 శాతం భరిస్తుంది. మిగిలినది బ్యాంకు రుణం ద్వారా వస్తుంది.

ప్రశ్న : లబ్ధిదారులకు ఆదాయ పరిమితులు ఏమైనా ఉన్నాయా?

జవాబు : గ్రామీణ ప్రాంతాల్లోని దరఖాస్తు దారులకు సంవత్సరానికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని వారికి సంవత్సరానికి రూ.2 లక్షలు ఉన్నాయి. అర్హతను ధ్రువీకరించడానికి దరఖాస్తుదారులు రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

పల్లెల్లో క్రీడా సంబురం

- ప్రీమియర్ క్రికెట్ లీగ్‌లతో యువత ఉర్రూతలు
- జట్లుగా ఏర్పడి గ్రామాల్లో పోటీల నిర్వహణ
- వెన్నుతట్టి ప్రోత్సహిస్తే.. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి యువత..



ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

మంచాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సెలవు దినాలు వచ్చాయంటే పల్లెల్లో క్రీడా సంబురం నెలకొంటుంది. యువకులంతా మైదానాలకు చేరుకుని ఆటపాటలతో రోజంతా ఉర్రూతలూగుతూ హల్‌చల్ చేస్తున్నారు. క్రీడాకారులంతా జట్లుగా విడిపోయి ప్రీమియర్ లీగ్‌లు ఆడుతూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గ్రామంలో జనాభాను బట్టి 6 నుంచి 20 టీమ్‌ల దాకా ఒక్కో టీంలో 11 మంది సభ్యులు ఉంటూ జట్లుగా ఏర్పడి విడతల వారీగా ముఖాముఖి తలపడుతున్నాయి. ఈ ప్రీమియర్ లీగుల్లో నెలల తరబడిగా పోటీలు కొనసాగుతుండడంతో జట్లలోని ప్రతీ సభ్యుడికి తమ క్రీడా సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశం దక్కుతోంది. ప్రతీ ఏడాది మూడు, నాలుగు నెలల పాటు ఈ ఆటలు కొనసాగి చివరగా లీగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జట్లు ఫైనల్లో తలపడుతున్నాయి. ఇలా గ్రామస్థాయిలో వివిధ జట్లలోని ఉత్తమ ఆటగాళ్లతో జట్టుకట్టి మండల స్థాయిలో జరిగే పోటీల్లో తమ గ్రామం తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఈ దశ జిల్లా స్థాయి దాకా చేరుకుంటుండడంతో మారుమూల గ్రామాల్లోని క్రీడాకారులకు సైతం తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం దక్కుతోంది.

ఐపీఎల్‌తో గ్రామాల్లో యువత క్రేజ్

గ్రామాల్లో ఆటలపై యువత క్రేజ్‌కి ఇండియన్ ప్రీమియర్ లీగ్ కారణంగా చెప్పవచ్చు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ ఆటగాళ్లను ఆయా జట్లలో చేర్చి నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నీతో ఐపీఎల్‌కు ప్రపంచ స్థాయిలో ఎంతటి ప్రాచుర్యం లభించిందో విదితమే. కాగా, గ్రామాల్లోనూ ఈ ప్రీమియర్ లీగ్‌లపై యువత ఆసక్తి కనబరుస్తున్నారు. గ్రామంలోని మొత్తం క్రీడాకారులను ఒక చోట చేర్చి బౌలర్లు, ఆల్‌రౌండర్లు, బ్యాట్‌మెన్స్, ఫీల్డర్లు, వికెట్‌కీపర్లను గుర్తించి ప్రతీ జట్టులోనూ వివిధ అంశాల్లో సమతుల్యత ఉండేలా 11 మంది సభ్యులుగల టీమ్‌ను ఎంపిక చేస్తున్నారు. గ్రామంలోని పూర్వ ఆటగాళ్లు, ప్రముఖులను ఆయా జట్లను మెంటార్లుగా నియమించుకొని సహకారం పొందుతున్నారు. ఆయా జట్లకు మెటార్లే స్పాన్సర్లుగామారి క్రీడాసామగ్రి, దుస్తులు అందజేసి అంకితభావాన్ని చాటుతున్నారు. దాంతో క్రీడాపోటీల నిర్వహణకు ఆర్థిక తోడ్పాటు దొరుకుతోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుంది.

క్రీడలతో స్నేహభావం పెంపునకు కృషి



క్రీడాపోటీలతో యువతలో స్నేహభావం పెంపొందుతుంది. దేహధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుంది. యువకులు ఆటపాటలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యసనాలకు దూరంగా ఉండాలి. గ్రామాల్లో యువకుల అభ్యున్నతికి మా వంతు సహకారం అందిస్తాం.

- మధు, సీఐ, మంచాల పోలీస్ స్టేషన్

అప్పట్లో ఊరికి ఒక జట్టుగానే ఆడేవాళ్లం



అప్పట్లో ఊరికి ఒక జట్టుగానే ఆటల పోటీల్లో పాల్గొనేవాళ్లం. ఎప్పుడూ పాత ఆటగాళ్లతో ఆట బోర్ కొట్టేది. ఐపీఎల్ క్రేజ్‌తో చాలా మంది యువకులు ఆటపై ఆసక్తి కనబరుస్తున్నారు. గ్రామంలో వివిధ కేటగిరీలుగా సభ్యులను విభజించి 10 టీమ్‌ల దాకా జట్లను లీగ్ పోటీలు ఆడిస్తున్నాం. మెంటార్లతో పోటీల నిర్వహణకు తోడ్పాటు లభిస్తోంది.

- చంద్రకాంత్, క్రీడాకారుడు, జాపాల

క్రైం కార్నర్

పుస్తెలతాడు అపహరణ

షాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల పుస్తెలతాడు దొంగిలించిన ఘటన ఆస్పల్లిగూడ స్టేజీ క్రైట్ కాలేజ్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. క్రైట్ కాలేజ్‌లో కేరెల్లి, మొగిలిగిద్ద గురుకుల పాఠశాల ఉంది. అయితే, ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లికి చెందిన బోడ మాధవి షాద్‌నగర్ నుంచి ఆర్టీసీ బస్సు ఎక్కి ఆస్పల్లిగూడ స్టేజీ వద్ద దిగి తమ పిల్లలను చూడడానికి వస్తున్న సమయంలో గురుకుల పాఠశాల గేటు వద్దకు రాగానే గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి వెనక నుంచి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెల తాడును లాక్కొని పోయారు. దాంతో మాధవి షాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించారు. ఓ వ్యక్తి ముందుగానే బైక్‌పై ఉండగా మరో వ్యక్తి వెనుక నుంచి వచ్చి పుస్తెలతాడు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు చెప్పింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని వలస కార్మికుడు మృతి

నందిగామ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటి పైకప్పు రాడ్డుకు ఉరేసుకొని వలస కార్మికుడు మృతిచెందిన సంఘటన ఆదివారం నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సప్పగూడ శివారులో గల గోవిందు పోచయ్య కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఒడిషాకు చెందిన దేవేంద్ర మాలిక్(40) కొన్ని సంవత్సరాలుగా కుటుంబసభ్యులతో కలసి గోవిందు పోచయ్య కాలనీల్లో నివాసముంటూ నర్సప్పగూడ శివాలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే, మద్యానికి బానిసైన దేవేంద్రమాలిక్ రోజు భార్య, పిల్లలతో గొడవపడేవాడు. ఆదివారం పూటుగా మద్యం సేవించి భార్య, ఇద్దరు కుమారులతో గొడవపడి ఇంటినుంచి బయటకు పంపించి డోర్ గడియ పెట్టుకుని ఇంటి పైకప్పు రాడ్డుకు చీరతో ఉరేసుకున్నాడు. ఎంతసేపటికీ డోర్ తీయకపోవడంతో స్థానికుల సహాయంతో మృతుని భార్య డోర్ పగలగొట్టగా విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రేపు(మంగళవారం) ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్వో పాషలు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

సర్వర్ డౌన్!

(3వ పేజీ తరువాయి)

సర్వర్ మొరాయిస్తుండటం, దరఖాస్తు సమర్పించిన తర్వాత అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ కాకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకవేళ మళ్లీ దరఖాస్తు చేస్తే అల్రెడీ అప్లైడ్ అని వస్తుందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేయడానికి రూపొందించినటువంటి ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో సర్వర్ సమస్యలు నెలకొన్నాయి. దరఖాస్తు సమయంలో తరచూ సర్వర్ ఎర్రర్ మెసేజ్ రావడమనేది పరిపాటిగా మారింది. దీంతో ఒక్కో దరఖాస్తు చేయడానికి కనీసం అరగంటకు పైగా ఎదురుచూడాల్సి వస్తోందని యువత పేర్కొంటున్నారు.

నేటితో ముగియనున్న గడువు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యువ వికాసంకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. అత్యధికంగా బీసీ, ఎస్సీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా వివిధ కార్పొరేషన్ల ద్వారా ఈనెల 11 వరకు 61,961 దరఖాస్తులు రాగా.. అందులో అధికంగా బీసీ కార్పొరేషన్‌కు 28,855, ఎస్సీ కార్పొరేషన్‌కు 13,816 దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుకు ఈనెల 14తో గడువు ముగియనుంది. అయితే సర్వర్ మొరాయిస్తుండటంతో యువకులు ఆందోళన చెందుతున్నారు.

వరుసగా సెలవులు..

జిల్లా వ్యాప్తంగా ఆయా కార్పొరేషన్ల ద్వారా ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 61,961 దరఖాస్తులు చేసుకున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తహసీల్దారు కార్యాలయాల నుంచి సకాలంలో అందకపోవడంతో చాలామంది దరఖాస్తుకు వెనుకడుగు వేస్తున్నారు. వరుసగా సెలువులు వచ్చాయి. రెండో శనివారం, ఆదివారం, సోమవారం అంబేద్కర్ జయంతి నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. దీంతో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ కష్టంగా మారింది. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి చాలా మంది యువత ఉత్సాహం చూపుతున్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పెంచాలని కోరుతున్నారు. మరోవైపు ఆదాయ ధ్రువీకరణ పత్రం లేకున్నా రేషన్ కార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. మీ-సేవ కేంద్రానికి వెళ్తే సర్వర్ పనిచేయక పోవడంతో విసిగి వేసారి పోతున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు ఆఫీసుల్లో వేలల్లో అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

కార్పొరేషన్ వారీగా వచ్చిన దరఖాస్తులు (ఈనెల 11 వరకు ఆన్‌లైన్ ద్వారా)

ఎస్సీ	ఎస్టీ	బీసీ	మైనారిటీ	క్రిస్టియన్ మైనారిటీ	మొత్తం దరఖాస్తులు
13,816	5,187	28,855	12,877	1,226	61,961

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మధుసూదన్‌రెడ్డి, భీంభరత్, చంద్రశేఖర్, చేవెళ్ల స్వామి

షాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : భారత రత్న డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించి, ఆయన అడుగుజాడల్లో నడుద్దామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శనివారం రాత్రి షాబాద్ మండల పరిధిలోని చందన్‌వెళ్లిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అణగారిన కులంలో పుట్టిన అంబేడ్కర్ నవ సమాజస్థాపక కోసం అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా భారత రాజ్యాంగాన్ని రచించారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు రాజ్యాంగమిచ్చిన హక్కుతోనే సాధ్యమైందని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాలను ప్రతీ గ్రామంలో, వాడలో నెలకొల్పి ఆయనను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం

షాద్‌నగర్ అర్బన్ : బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు అంబేడ్కర్ విగ్రహాలను పాలతో కడిగి శుభ్రం చేశారు. బీజేపీ షాద్‌నగర్ పట్టణ శాఖ అధ్యక్షుడు హరిభూషణ్ పటేల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, నివాళులర్పించారు. సమాజంలోని అంటరాని తనం, పేదరిక నిర్మూలన, సమాన న్యాయం, హక్కులు రాజ్యాంగంతోనే సాధ్యమవుతున్నాయని గుర్తుచేశారు. నాయకులు నందిగామ వెంకటేష్, కురుమయ్య, ప్రశాంత్ ముదిరాజ్, ప్రభాకర్, రవిగౌడ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : అంబేడ్కర్ విగ్రహాన్ని పాలతో కడుగుతున్న బీజేపీ నాయకులు

జయంత్యుత్సవాలు

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చెక్కాల లక్ష్మణ్, కృష్ణనాయక్, మేడిశెట్టి శ్రీధర్, నరేందర్ రాథోడ్, రవిరాథోడ్, రాజు, శ్రీను యాదవ్, రామస్వామి, భరత్, రమేశ్‌గౌడ్, ఆనంద్, బుచ్చయ్య, గిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయంతిని పండుగలా జరుపుకోవాలి

అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఆమనగల్లు అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్ కోరారు. మహనీయుల జయంతులు, వర్ధంతులు పండుగలా జరుపుకోవాలని సూచించారు. ఆమనగల్లులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహేశ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. కాగా, నేడు అంబేడ్కర్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అయ్యప్ప జయంతికి ఆలయం ముస్తాబు

● నేడు మహాపడి పూజ



ముస్తాబైన అయ్యప్పస్వామి ఆలయం

ఆమనగల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప కొండపై గల శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయం అయ్యప్ప జయంతి వేడుకలకు ముస్తాబైంది. ప్రతీయేట ఇక్కడ స్వామివారి జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. సోమవారం నిర్వహించే వేడుకలకు ఆలయ నిర్వాహకుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. జయంతి వేడుకల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపకులు రాజు దేశ్‌పాండే గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులతో సబితారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దమ్మతండా గ్రామంలోని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 15మంది ఆదివారం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు తేజునాయక్ ఆధ్వర్యంలో నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆమె సమక్షంలో పార్టీలో చేరారు. సబితారెడ్డి మాట్లాడుతూ 14నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన కె.రాములునాయక్, హరిచంద్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్, లింగంనాయక్, దేవేందర్‌నాయక్, శంకర్‌నాయక్‌లతో పాటు మరి కొందరికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు.

ఆకట్టుకున్న పద్యనాటకం



షాద్‌నగర్ అర్బన్ : పద్యనాటక ప్రదర్శనలోని ఓ సన్నివేశం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దక్షిణోత్తర రామేశ్వరంగా ప్రసిద్ధిగాంచిన ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరం పుణ్యక్షేత్రంలో శనివారం రాత్రి నిర్వహించిన పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పౌర్ణమిని పురస్కరించుకుని రంగక్షేత్ర రంగస్థల కళల విద్యాలయం, నటమండలి హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో పౌర్ణమి రంగస్థల ప్రకాశనమ్ అను పేరుతో పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు చేపట్టారు. శ్రీకృష్ణరాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధం నాటకాలలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించి, భక్తులను అలరించారు. కృష్ణుడుగా జెఎస్వీ శివప్రసాద్, అర్జునుడిగా వి.ప్రభాకరాచారి, దుర్యోధనుడిగా డి. భాస్కర్‌గౌడ్, రాముడిగా టి.కృష్ణ, ఆంజనేయుడిగా వి.రమేష్‌చారిలు తమ ప్రతిభను చాటారు. ప్రతి పౌర్ణమి రోజు నాటక ప్రదర్శనలను కొనసాగిస్తామని నటుడు శివప్రసాద్ తెలిపారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు టీవీ రంగయ్యలు హాజరై పౌరాణిక నాటకాలను భవిష్యత్తు తరాలకు అందించడానికి కృషి చేస్తున్నారని కళాకారులను అభినందించారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో భజన పోటీలు

ఆమనగల్లు : మున్సిపాలిటీ పరిధి అంతిరింతిరి కొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నిర్వాహకులు భజన పోటీలు నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన భజన పోటీలలో వివిధ గ్రామాలకు చెందిన భజనకారులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. చింతోజు వివేకానంద, పబ్బు పరమేశ్, గంగ రవి, శ్రీను, వెంకటేశ్, మల్లేశ్, జైరామ్, బండ మల్లేశ్, కొండల్, రామచంద్రయ్య, కృష్ణ పాల్గొన్నారు.



ఆమనగల్లు : బహుమతులందజేస్తున్న సభ్యులు

కాలమేదైనా కలిసొచ్చే పంట

(3వ పేజీ తరువాయి)

ఆదాయం వస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు. చేవెళ్ల డివిజన్‌లో మొత్తం 432 ఎకరాల్లో రైతులు వివిధ రకాల ఆకుకూరలను సాగు చేస్తున్నారని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ తెలిపారు. సాగులో మెలకువలపై సలహాలు, సూచనలిచ్చారు.


దుక్కి.. విత్తనాలు నాటే విధానం

పొలాన్ని మూడు నాలుగుసార్లు దున్ని మట్టిని మెత్తగా చేసుకోవాలి. దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు, 300 కిలోల వేపపిండి, 100 కిలోల సూపర్ పాస్పేట్, 10 కిలోల జింక్ సల్ఫేట్, 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించి విత్తనాలు చల్లుకోవాలి. జింక్ సల్ఫేట్ సూపర్ పాస్పేట్ కలువకుండా చల్లాలి. తోటకూర విత్తనాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అందుకని వాటిని ఇసుకతో కలిపి మడుల్లో పలుచగా చల్లుకోవాలి. తర్వాత మెత్తటి మట్టితో పలుచటి పొరలా కప్పాలి. పాల కూర విత్తనాలను 3 నుంచి 4 సెం.మీ లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొలక సరిగారాదు. ధనియాలు విత్తేముందు రెండు భాగాలుగా చేయాలి. లేకుంటే మొలక ఆలస్యంగా మొదలవుతుంది. వేసవిలో ఎండ వేడిమి నుంచి రక్షణ కోసం రకరకాల షెడ్లు అవసరం మేరకు వాడుకోవాలి.

సస్యరక్షణ చర్యలు

- ఆకుకూర విత్తనాల శుద్ధికి వేప శిలీంద్రనాశిని కిలో విత్తనానికి 8 గ్రాములు కలిపి విత్తితే వేళ్లకు తెగులు అంతగా రాదు.
- విత్తనం విత్తిన 48 గంటలలోపు లీటరు నీటికి 4సెం.మీ పెండిమిథలీన్ కలుపునాశిని పిచికారీ చేస్తే తొలి దశలో కలుపురాదు.
- పంట ఎదుగుదలకు లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున 19.19.19ను ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వారానికి ఒకసారి పంటకు నీరందించాలి. ఆకుకూరలపై దుమ్ముధూళి ఉండకూడదంటే తుంప విధానంలో నీరందించాలి.
- మందులను పిచికారీ చేయాలి. మందు పిచికారీ చేసిన ఐదు వారాల తర్వాత పంటను కోయాలి. కోత కోసిన తర్వాత ఎకరానికి 10 కిలోల యూరియా చల్లాలి. తోటకూరలో సీఓ -1, సీఓ-2 రకాలు విత్తిన 25 రోజుల్లో వేర్లతో పీకి అమ్ముకోవాలి. విత్తిన 25 రోజుల తర్వాత కొమ్మలను కత్తిరించిన తర్వాత ప్రతి వారానికి కోత చొప్పున 90 రోజుల వరకు పంట కోయవచ్చు.

ఆకుకూరలకు డిమాండ్ ఉంది



ఆరోగ్యానికి మంచిదని ఆకుకూరలకు మంచి డిమాండ్ ఉంది. బోరుబావుల కింద ఎకరం పొలంలో రెండు రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నారు. నేను పాలకూర, పుదీనా పంటను సాగు చేస్తున్నా. మల్కాపూర్ నుంచి రోజూ గుడిమల్కాపూర్ మార్కెట్‌కు అన్నిరకాల ఆకుకూరలు, ఆకుకూరలను స్వయంగా తీసుకెళ్లి అమ్ముకుంటాం. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో మార్కెటింగ్ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

- రంగారెడ్డి, రైతు, మల్కాపూర్

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

తలకొండపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చింతకుంట్ల రాజు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్యస్నేహితులు ఆదివారం రాజు కుటుంబాన్ని పరామర్శించారు. తలాకొంత పోగుచేసి రూ.12 వేలు స్నేహితుడి కుటుంబానికి అందజేశారు. గణేశ్, రాజు, శ్రీశైలం, వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీరాములు, రాజు, నూకం శివ, ఆంజనేయులు, కిరణ్, సురేశ్, తదితరులు ఉన్నారు.

వివేకానందుడి విగ్రహం ఏర్పాటుకు సహకారం

తలకొండపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగాయిపల్లిలో వివేకానందుడి విగ్రహం ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి సహకారం అందించారు. ఆదివారం గ్రామస్థులు ప్రభాకర్‌రెడ్డిని వివేకానంద విగ్రహం ఏర్పాటుకు సహకారం అందించాలని కోరగా రూ.30వేలు అందజేశారు. ఆయన్ను సత్కరించి అభినందించారు. నాయకులు జనార్దన్‌రెడ్డి, శివప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, కేశవులు గౌడ్, సురేశ్‌గౌడ్, కొండల్ గౌడ్, దిలీప్‌కుమార్, నాగరాజు, సతీష్ కుమార్, నరేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జంగమ్మ మృతిపట్ల ప్రముఖుల సంతాపం

ఆమనగల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చెంచు సేవా సంఘం జిల్లా నాయకురాలు, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మండ్లీ రాములు మాతృమూర్తి జంగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం ఆమనగల్లు మండలం శంకర్ తండాలో జంగమ్మ మృతదేహాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. జంగమ్మ మృతిపట్ల సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీ మల్లు రవి, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి మదుసూధన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిలు ఉన్నారు. జగన్, మానయ్య, విజయ్, జంగయ్య, పర్వతాలు, శేఖర్‌రెడ్డి, మోతిలాల్, శ్రీను నాయక్, ఖాదర్‌ఖాద్రి, రాఘవేందర్, కాలే మల్లయ్య, మల్లేశ్, హాజీపాష తదితరులున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 159 రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్‌లు కోరారు.

నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

తలకొండపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో కాడెమోని లింగం నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఆదివారం మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం కేంద్రాన్ని ప్రారంభించారు. నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన లింగంను గ్రామస్థులు అభినందించారు. నాయకులు పద్మనాభం, శంకర్, బిక్షపతి, సాయిలు, కుమార్, నవీన్, సత్తయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.